కరుగుతున్న గుట్ట

పెద్దగరుగు గుట్టలో బ్లాస్టింగ్‌లు

- మూగజీవాలకు కరువవుతున్న మేత
- రాళ్ల తరలింపునకు చెరువును పూడ్చిన లీజుదారుడు
- అధికారుల తీరుపై విమర్శలు

గాండ్లపెంట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండల్లో బ్లాస్టింగ్‌లు ఎక్కువయ్యాయి. లీజు పేరుతో కొండల్లోని బండలను పగులగొట్టి కొందరు సొమ్ము చేసుకుంటుండగా, పశువులకు మేత కరువయ్యే పరిస్థితి నెలకొంది. మండలంలోని సామచేనుబైలు వద్ద పెద్దగరుగు గుట్టను తవ్వడానికి అధికారులు అనుమతిచ్చారు. దాదాపు 75ఎకరాలకు పైగా లీజుకిచ్చారు ఇందులో తెల్లరాయి పుష్కలంగా ఉంది. అయితే ఈకొండే ఆధారంగా దాని చుట్టూ సామచేనుబైలు, నల్లసానిపల్లి, హరిజనవాడ, పంత్రవాండ్లపల్లి తదితర గ్రామాల్లోని దాదాపు 50 కుటుంబాల ప్రజలు పశువులు గొర్రెలు, మేకలు మేపుకుని జీవనం సాగిస్తున్నారు. గ్రామస్థులకు తెలియకుండానే పెద్దగరుగు గుట్టను అధికారులు మైనింగ్‌కు లీజుకిచ్చారు. దీంతో కొండ కరిగిపోతోంది. భవిష్యత్‌లో పశువులు మేపుకోవడానికి వీలు లేకుండా పోతుందని కాపర్లు వాపోతున్నారు. అలాగే పెద్దగరుగుగుట్ట మీదుగా సమీపంలోని కొండలకు వెళ్లాల్సి ఉంది. మైనింగ్ జరుగుతుండటంతో అక్కడకు వెళ్లడం ఇబ్బందిగా మారిందని పలువురు చెబుతున్నారు. బండలను తూటాలు పెట్టి పేల్చినపుడు రాళ్లు ఎగిరి వచ్చి, మనుషులు, పశువులు గాయపడిన సంఘటనలు అనేకం ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెరువు పూడ్చి దారి ఏర్పాటు


పెద్దగరుగు గుట్టలో బ్లాస్ట్ చేసిన రాళ్లను తరలించడానికి వాహనాలు సామచేనుబైలు వద్ద చిన్నబయ్యన్నకుంట సమీపంలో వెళ్లాల్సి ఉంది. దీంతో లీజుదారుడు చిన్నబయ్యన్నకుంటలోకి వచ్చే నీటికి అడ్డకట్ట వేసి, దారి ఏర్పాటు చేయించాడు. సామచేనుబైలు మధ్యలోకూడా మడుగువారిగొంది చెరువుకు నీరు వెళతాయి. ఆ కొండల మధ్యకూడా దారి కోసం పైపులు అమర్చి దారి ఏర్పాటు చేశారు. ప్రభుత్వభూములు, చెరువులు, కుంటల్లో మైనింగ్ యజమానులు ఇష్టానుసారంగా రోడ్లు వేసుకున్నా, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పశువుల మేత కష్టమే

గ్రామాల్లో ప్రజలు వ్యవసాయం, పశు పోషణ మీదే ఆధారపడి జీవిస్తున్నారు. కార్పొరేట్ సంస్థలు, రియల్టర్లు ఇటు కొండలు, అటు భూములపై కన్నేసి వాటిని బడా నాయకుల అనుమతితో లీజుపేరుతో ఆక్రమిస్తున్నారు. దీంతో గ్రామాల్లో పశువులకు మేత కరువయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. మండలంలో పశువులు, గొర్రెలు, గేదెలు దాదాపు 5లక్షలకుపైగా ఉన్నాయి. కొండలను బ్లాస్ట్ చేస్తుండటంతో పశువులకు అవసరమయ్యే మేత కోసం ఇబ్బంది పడాల్సి వస్తుందని కాపరులు వాపోతున్నారు.



పెద్దగరుగు గుట్టలో మైనింగ్ కు ధ్వంసమైన బండరాళ్లు



చెరువులో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన రహదారి



మేత బరువే: నరసింహులు, పంత్రవాండ్లపల్లి

కొండలను పేలుస్తుండటంతో పశువులకు మేత దొరకడం కష్టంగా మారింది. నాకు 80కి పైగా మేకలు, గొర్రెలున్నాయి. నిత్యం పెద్దగరుగు గుట్టకు తోలుకెళ్లి మేపుకు వస్తా. ఆరునెలల నుంచి మైనింగ్ పనులు జరుగుతుండటంతో మేత కరువవుతోంది. ఈకొండలు కరిగిపోతే రానున్న రోజుల్లో మేతకు తీవ్ర ఇబ్బందులు పడాల్సిందే. ప్రభుత్వము, అధికారులు ఇలా కొండలను మైనింగ్‌కు లీజుకు ఇవ్వడంతో మా జీవనం దుర్భరంగా మారుతోంది.

అనుమతులున్నాయి: బాబురావు, తహసీల్దార్

సామచేనుబైలు గ్రామం వద్ద పెద్దగరుగు గుట్టకు మైనింగ్ అనుమతులు ఉన్నాయి. అందువల్ల తవ్వకాలు జరుగుతున్నాయి. మైనింగ్ మా పరిధిలోకి రాదు. లీజు ప్రాంతంలో కాకుండా మరోచోట తవ్వితే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

ఎస్కేయూలో అక్రమాల నిగ్గు తేల్చండి

- ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో వైసీపీ పాలనలో జరిగిన అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలపై అక్రమాలుంటే నిగ్గు తేల్చాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి.. ప్రభుత్వాన్ని శుక్రవారం కోరారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ వైస్‌చాన్సలర్ ఆధ్వర్యంలో ఈసీ నిబంధనలు పాటించకుండా 21 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారన్నారు. ఈ విషయంలో అక్రమాలుంటే నిగ్గుతేల్చాలని కోరారు. నియామకాలు చెల్లవని జస్టిస్ హనుమంతు కమిటీ ఇచ్చిన నివేదిక వాస్తవమా.. కాదా తెలపాలని కోరారు. 2019-2024 మధ్యకాలంలో నిబంధనలు పాటించకుండా ఇచ్చిన ప్రొఫెసర్ల ఉద్యోగోన్నతులపై కూడా విచారణ జరపాలన్నారు. ఎస్కేయూనివర్సిటీలో ఖాళీగా ఉన్న 230 బోధన పోస్టులలో 45 మాత్రమే భర్తీచేశారని, మిగిలినవి ఎప్పటిలోగా భర్తీ చేస్తారో తెలపాలని మంత్రిని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ అడ్మిషన్లు 34శాతానికి పడిపోయాయని వీటిని పెంచడానికి ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుంటుందా అని ప్రశ్నించారు. యూనివర్సిటీలో 20ఏళ్లుగా టైంస్కేల్ కింద పని చేస్తున్న 280 మందిని రెగ్యులరైజ్ చేసే అవకాశం ఉందా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. మంత్రి నారాలోకేశ్ మాట్లాడుతూ ఎస్కేయూలో జరిగిన నియామకాలపై ఫిర్యాదులున్నాయని, ప్రభుత్వం వీటిపై విచారణ చేస్తోందన్నారు. డిగ్రీ అడ్మిషన్లు పెంచడానికి సంబంధిత అధికారులతో చర్చిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీల్లో 3282 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కోర్టు కేసుల వల్ల ఆలస్యమవుతోందని, వీటన్నింటిపై వంద రోజుల ప్రణాళిక పెట్టుకుని పోస్టుల భర్తీకి చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాట్లాడుతూ వడ్డెర్లకు రాయల్టీలో మినహాయింపు ఇవ్వాలని కోరారు.



మరువ పారేందుకు సిద్ధంగా ఉన్న ధర్మవరం చెరువు

నిండుకుండలా..

నీటితో తొణికిసలాడుతున్న ధర్మవరం చెరువు

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ధర్మవరం చెరువు నిండుకుండలా మారింది. సన్నగ వీచే గాలికే నీటి అలలు ఒడ్డును ఢీకొట్టి, ఎగసి పడుతునానయి. ఏ క్షణమైనా మరువ పారే పరిస్థితి ఉంది. ఖరీఫ్ ఆరంభం నుంచి కురుస్తున్న వర్షాలకు ధర్మవరం చెరువుకు నీరు చేరుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి, చిత్రావతి నది నుంచి నీరు చేరింది. ప్రస్తుతం రెండో మరువ వద్ద అలలకు నీరు బయటకు వస్తోంది. ఇప్పుడు ఓ మోస్తరు వర్షం కురిసినా పూర్తిస్థాయిలో అన్ని మరవల నుంచి నీరు పారుతుందని స్థానిక రైతులు చెబుతున్నారు. ధర్మవరం చెరువు నీటితో నిండుగా ఉండటం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువు నుంచి ఆయకట్టుకు నీరు వదిలితే పంటలు సమృద్ధిగా పండించుకుంటామని చెబుతున్నారు. బోరుబావుల్లో భూగర్భ జలాలు పెరిగినట్లు పలువురు చెబుతున్నారు.

తప్పు చేయాలంటే భయపడాలి

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం: ఎస్పీ సతీష్‌కుమార్

హిందూపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తప్పు చేసేవారెవరైనా పోలీసులను చూస్తే భయపడేలా చేస్తామని ఎస్పీ సతీష్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక వన్‌టౌన్‌పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టవేయడానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. డ్రోన్‌ల సాయంతో రాత్రివేళల్లో కూడా నేరస్తులను గుర్తించేందుకు త్వరలోనే శ్రీకారం చుడుతామన్నారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. సోషల్ మీడియాలో తప్పుడు, రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లాలో అధిక వడ్డీ వసూలు చేసేవారు, భూకబ్జాలు, చీటింగ్ చేసేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అక్రమ మద్యం, పేకాట నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. జిల్లాలో భూసమస్యలు అధికంగా ఉన్నాయని, అలా వచ్చిన వారికి అవగాహన కల్పించి రెవెన్యూ, కోర్టుకు వెళ్లేలా చర్యలు చేపడతామన్నారు. అంతకుముందు ఆయన సూగూరు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం సీఅండ్ఐజీ చర్చికి వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. అక్కడి నుంచి మసీదుకు వెళ్లి ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, సీఐలు ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీంలు ఉన్నారు.



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

బ్యాంకు కేసుపై ఆరా

హిందూపురానికి వచ్చిన జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ బంగ్లాలో డీఎస్పీ, సీఐలతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా హిందూపురం నియోజకవర్గంలో రాజకీయ ముసుగులో ఉన్న కొంత మంది నేరస్థులు, దందాలు చేసేవారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల తూమకుంట చెక్‌పోస్టులో జరిగిన బ్యాంకు దోపిడీ కేసుపై లోతుగా ఆరాతీశారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు.

అభ్యర్థులకు పరీక్ష..!

- ఎస్కేయూ అధికారుల ఇష్టారాజ్యం
- చెప్పాపెట్టకుండా పరీక్ష కేంద్రం మార్పు
- పరుగులు తీసిన బీఈడీ దూరవిద్య అభ్యర్థులు
- ఇద్దరు బాలింతలు అడిగినందుకు మార్చారట..!



ఒకరి వెనుక ఒకరు కూర్చుని పరీక్ష రాస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో పరీక్షల నిర్వహణ గందరగోళంగా మారుతోంది. కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో అభ్యర్థులు నష్టపోతున్నారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు శుక్రవారం నిర్వహించిన బీఈడీ దూర విద్య పరీక్షలలో ఇలాంటి వ్యవహారమే చోటు చేసుకుంది. ఎస్కేయూ బీఈడీ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తామని హాల్ టిక్కెట్‌లలో పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు కళాశాల అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. కానీ ఎవరికీ సమాచారం ఇవ్వకుండా వర్సిటీ అధికారులు పరీక్ష కేంద్రాన్ని రెండు ప్రాంతాలకు మార్చారు. మార్పు (మిగతా 7లో...)

విశ్వశాంతి కోసం..

- ప్రశాంతి నిలయంలో యజ్ఞం

పుట్టపర్తి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రశాంతినిలయంలో వేదపండితులు యజ్ఞాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఉదయం 8గంటలకు సాయికుల్వంతు సభామండపంలో సత్యసాయి మహాసమాధి వద్ద వేదపండితులు కలశపూజ నిర్వహించారు. మంగళవాయిద్యాలు, బ్యాండ్‌మేళాలతో కలశాన్ని తీసుకుని ర్యాలీగా యజ్ఞం వేదిక అయిన పూర్ణచంద్రహాల్‌కు చేరుకున్నారు. విద్యార్థులు, వేదపండితులు వేదమంత్రోచ్ఛరణ చేస్తుండగా పండితులు వేదపురుష సప్తాహ జ్ఞాన యంత్రాన్ని ప్రారంభించారు. యజ్ఞంలో మొదట గణపతి పూజ నిర్వహించారు. పండితులు శివలింగార్చన చేశారు. సర్వదేవత ఆవాహన చేస్తూ యజ్ఞాన్ని కొనసాగించారు. మొదటి రోజు యజ్ఞాన్ని తిలకించడానికి వేలాది మంది భక్తులు పూర్ణ చంద్రహాల్‌కు చేరుకున్నారు. దసరా ఉత్సవాలలో భాగంగా ప్రతిఏడాది యజ్ఞాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వారం రోజులపాటు యజ్ఞం నిర్వహించనున్నారు. వేదపండితులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పట్టువస్త్రాలను అందజేశారు. సాయంత్రం సాయికుల్వంతు సభామండపంలో నందగిరి విద్యార్థులు సంగీత గాన కచేరి నిర్వహించారు.



యజ్ఞం చేస్తున్న పండితులు



లింగార్చన చేస్తున్న పండితుడు

సీఎంపై అనుచిత పోస్టులు

వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నుంచి గుంటూరుకు తరలింపు మెయిన్‌లో..



గద్దం శివప్రసాద్ (ఫైల్)

వైద్యంలో నిర్లక్ష్యం పసివారి బలి

- వివరాలు 7లో..



రామావతారంలో దర్శనమిస్తున్న కదిరి లక్ష్మీ నరసింహుడు

రామయ్యగా శ్రీహరు



ఆలయం వద్ద భక్తుల కోలాటం

కదిరి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి.. శ్రీరామచంద్రుడిగా దర్శనమిచ్చారు. దరసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో వెలసిన శ్రీవారికి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం శ్రీరాముడిగా అలంకరించి, పూజలు నిర్వహించారు. విల్లుపట్టిన రాముడి రూపంలో శ్రీవారు భక్తులను కనువిందు చేశారు.

శ్రీమహాలక్ష్మిగా దుర్గమ్మ



శ్రీమహాలక్ష్మి అలంకారంలో దుర్గాదేవి

లేపాక్షి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీమహాలక్ష్మిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలోని వీరభద్ర స్వామి ఆలయంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఐదోరోజు అమ్మవారిని శ్రీమహాలక్ష్మిగా అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చనలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కల్పించండి: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి శుక్రవారం మండలస్థాయి అధికారులతో జీఎస్టీ 2.0 అమలుపై కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 22నుంచి అమలు చేస్తున్న జీఎస్టీ సంస్కరణల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. అక్టోబరు 19వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఆ దిశగా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో జేసీ, ఆర్డీఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వాణిజ్య పన్నుల అధికారులు, గ్రామ, సచివాలయ సిబ్బంది సభ్యులుగా ఉంటారన్నారు. సమీక్షలో ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్



వేడుకలలో విద్యార్థుల ఉల్లాసం





ప్రసంగిస్తున్న వీసీ సుదర్శన్‌రావు



అలరించే నృత్య ప్రదర్శన

ప్రతి విద్యార్థి ఉద్యోగాలు సృష్టించాలి

పరిశోధనలతో జ్ఞానాన్ని పెంచుకోవాలి

జేఎన్‌టీయూఏ వైస్ చాన్స్‌లర్ సుదర్శన్‌రావు

ఘనంగా ఇంజనీరింగ్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే

అనంతపురంరూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఉద్యోగం కోసం కాకుండా ఉద్యోగాలు సృష్టించే ఆలోచనలతో ముందుకు సాగాలని జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శన్ రావు సూచించారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ వేడుకలకు జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా రిజిస్ట్రార్ కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డితో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వీసీ మాట్లాడుతూ..జేఎన్‌టీయూ కళాశాలకు 79ఏళ్ల చరిత్ర ఉందన్నారు. ఇందులో చదవడం విద్యార్థులకు వరమన్నారు. ఇక్కడ విద్యార్థుల్లో జూనియర్లు, సీనియర్లు అనే తారతమ్యాలు ఉండవని. అందరూ కలిసి చదువుతున్నారన్నారు. విద్యార్థులకు ఇంజనీరింగ్ చదివే సమయం చాలా విలువైందన్నారు. మంచి నడవడిక, క్రమశిక్షణతో ఎప్పటికప్పుడు కొత్త విషయాల మీద పరిశోధనలు చేస్తూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సివిల్ సర్వీసెస్ వైపు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, కళాశాల సీనియర్ ఆచార్యులు, విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అదరగొట్టిన విద్యార్థులు

ఫ్రెషర్స్ డేను పురస్కరించుకుని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. విద్యార్థులు ఆటపాటలతో అదరగొట్టారు. తెలుగుదనం ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తమ అభిమాన సినీ నటీనటుల పాటలకు విద్యార్థులు ఉత్సాహంగా డ్యాన్స్ నిర్వహించారు. వారిని ఉత్సాహపరుస్తూ మిగతా విద్యార్థులు ఈలలు, కేకలతో ఆడిటోరియం దద్దరిల్లేలా సందడి చేశారు. ఈ కార్యక్రమాలన్నింటిని ఫొటోలు, వీడియోలు తీస్తూ మరికొందరు కనిపించారు.

11వ శతాబ్దపు శాసనం గుర్తింపు

● పాతదేవరపల్లి చెన్నకేశవ ఆలయంలో గుర్తించిన రిటైర్డ్ హెచ్‌ఎం



పురాతన శాసనాన్ని పరిశీలిస్తున్న రిటైర్డ్ హెచ్‌ఎం వెంగన్న, గోపి

కొత్తచెరువు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాతదేవరపల్లి గ్రామ చెన్నకేశవస్వామి ఆలయంలో 11వ శతాబ్దానికి చెందిన శిలా శాసనం గుర్తించినట్లు విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు వెంగన్న, ఉపాధ్యాయుడు గోపి శుక్రవారం తెలిపారు. 11వ శతాబ్దంలో హొయసాల రాజు మొదటి విష్ణువర్ధన కాలంలో ఈ ఆలయం నిర్మించినట్లు వారు పేర్కొన్నారు. ఆలయంలో విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు 1511లో రాతిపై లిఖించిన శాసనంతోపాటు మరో నాలుగు శాసనాలు ఉన్నాయన్నారు. ఈ శాసనాలు తెలుగు, కన్నడ భాషల సమ్మిళితంగా ఉన్నాయని వారు తెలిపారు. ఈ ఆలయంలో చెన్నకేశవస్వామి విగ్రహం ప్రతి ఏడాది కొద్దికొద్దిగా పెరుగుతున్నట్లు గుర్తించామని వివరించారు. లక్ష్మీదేవి లింగరూపంలో పూజింపబడటం ఇక్కడి ప్రత్యేకత అని వారు తెలిపారు. ఈ ఆలయ నిర్వహణకు 125 ఎకరాల వ్యవసాయభూమిని రాజులు ఇచ్చారన్నారు. ఆ భూమి ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి ఉపయోగిస్తున్నట్లు పురోహితులు తెలిపారు.



రాయిపై లిఖించిన శాసనం

వైద్యంలో నిర్లక్ష్యం.. పసివారి బలి

ఉరవకొండలో బాలుడు.. అనంతలో నవజాత శిశువు

ఆస్పత్రుల వద్ద బాధిత కుటుంబాల ఆందోళన



ఉరవకొండ సీహెచ్‌సీ వద్ద బాలుడి మృతదేహంతో ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

అనంతపురం క్రైం/వైద్యం, ఉరవకొండ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒకే రోజు ఇద్దరు పసివారు ఆస్పత్రుల్లో ప్రాణాలను పోగొట్టుకున్నారు. అనంతపురంలోని నవజాత శిశువు, ఉరవకొండ సీహెచ్‌సీలో ఐదేళ్ల బాలుడు శుక్రవారం మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబాలవారు ఆందోళనకు దిగారు.

● వజ్రకరూరు మండలం చాబాల గ్రామానికి చెందిన రాజేష్, సవిత దంపతుల కుమారుడు అహరున్ కుమార్(5)కు జ్వరం రావడంతో గురువారం రాత్రి 11 గంటలకు ఉరవకొండ సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. వైద్యుడు ఇస్మాయిల్ ఆస్పత్రి ఆవరణలోనే ఉన్నా.. బాలుడిని చూసేందుకు రాలేదు. సెలైన్ పెట్టాలని నర్సులకు సూచించాడు. బాలుడికి వారు సెలైన్ బాటిల్ ఎక్కించారు. తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. అర్ధరాత్రి సమయంలో బాలుడు తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. నర్సు దగ్గరకు వెళ్లి తల్లిదండ్రులు ప్రాధేయపడినా పట్టించుకోలేదు. దీంతో బాలుడు తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ విషయాన్ని కూడా కుటుంబ సభ్యులే గుర్తించారు. కోపోద్రిక్తులై.. వైద్యుడు, సిబ్బందిని నిలదీశారు. తమ కుమారుడి మృతికి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని, వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. తమ కుమారుడి మృతికి కారణమైన వారిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న డీసీహెచ్‌ఎస్ డేవిడ్ సెల్వరాజ్ విచారణ చేపట్టారు. విధుల్లో ఉన్న వైద్యుడు, నర్సులను వేర్వేరుగా విచారించారు. బాలుడి మృతిపై సమగ్ర విచారణ చేసి, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

అనంతలో అమ్మ ఆస్పత్రిపై దాడి..



బిడ్డను పోగొట్టుకుని.. అమ్మ ఆస్పత్రిలో విషాదంలో బాలింత

వైద్యుల నిర్లక్ష్యం వల్లే పుట్టిన శిశువు మరణించాడంటూ తల్లిదండ్రులు, బంధువులు అనంతపురం నగరంలోని అమ్మ ఆస్పత్రిపై శుక్రవారం రాత్రి దాడి చేశారు. అద్దాలు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. నగరంలోని 5వ రోడ్డులోని హనుమాన్ కాలనీకి చెందిన చెందిన శిరీష ఈ నెల 20న అమ్మ ఆస్పత్రిలో మగ శిశువుకు జన్మనిచ్చారు. శిశువుకు ఊపిరితిత్తుల సమస్య వచ్చిందంటూ సాయినగర్‌లో ఉన్న హృదయ ఆస్పత్రికి తరలించారు. అక్కడ మూడు రోజులపాటు వైద్యం అందించారు. పరిస్థితి మెరుగవకపోవడం, డాక్టర్లు చేతులు ఎత్తేయడంతో ఈ నెల 24న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో శుక్రవారం శిశువు మరణించాడు. వైద్యానికి రూ.4 లక్షల వరకూ ఖర్చు అయినా శిశువు మరణించడంతో బాధితుల కోపం కట్టలు తెంచుకుంది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని కుటుంబ సభ్యులు, బంధువులు శుక్రవారం రాత్రి అమ్మ ఆస్పత్రి వద్దకు చేరుకుని, గొడవకు దిగారు. తాము చెప్పినట్లుగా ముందుగానే ఎందుకు సిజేరియన్ చేయలేదని, మీ నిర్లక్ష్యం వల్లే ఇదంతా జరిగిందని ఆస్పత్రి వర్గాలతో గొడవకు దిగారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం రేగి, దాడికి దారి తీసింది.

అమ్మాయిలు.. ఫుట్‌బాల్ చాంపియన్స్

రాష్ట్రస్థాయి టోర్నీ కైవసం.. బాలుర జట్టుకు తృతీయ స్థానం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 ఫుట్‌బాల్ అనంత అమ్మాయిలు అదరగొట్టారు. చాంపియన్‌గా అవతరించారు. జిల్లా బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో గురువారం నిర్వహించిన ఫైనల్లో అనంత బాలికల జట్టు 3-0 గోల్స్ తేడాతో విశాఖపట్నంపై గెలుపొంది, టోర్నీని కైవసం చేసుకుంది. జిల్లా జట్టు, కోచ్‌లు మారుతిప్రసాద్, జయప్ప, దాదా ఖలందర్, సుశీలను డీవీఈఓ నారాయణ నాయక్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, పీడీలు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని అభినందించారు.



ట్రోఫీ అందుకుంటున్న జిల్లా బాలికల జట్టు

మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్ హిందూపురం వరకూ పొడిగింపు

గుంతకల్లు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్‌ను తాత్కాలికంగా హిందూపురం వరకూ పొడగించినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ధర్మవరం వరకూ వెళ్తున్న ఈ రైలును నవంబరు మూడో వారంలో హిందూపురం వరకూ గమ్యస్థానాన్ని పెంచనున్నట్లు తెలియజేశారు. మచిలీపట్టణం-హిందూపురం (17215) రైలును నవంబరు 20నుంచి 26వ తేదీ వరకూ నడపనున్నామన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 17216) నవంబరు 21నుంచి 27వతేదీ వరకూ హిందూపురం నుంచి బయలుదేరుతుందన్నారు. ఈ రైలు సత్యసాయి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్‌లోనూ నిలుస్తుందన్నారు.

అభ్యర్థులకు పరీక్ష..!

(5వ పేజీ తరువాయి)

గురించి శుక్రవారం ఉదయం పరోక్ష సమాచారం అందడంతో పరీక్షల విభాగం అధికారులను బీఈడీ కాలేజీ సిబ్బంది సంప్రదించారు. మార్పు ఉండదని వారు చెప్పడంతో మిన్నకుండిపోయారు. ఈ క్రమంలో అభ్యర్థులు పరీక్ష రాసేందుకు బీఈడీ కాలేజీ వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం రెండు గంటలకు పరీక్ష ప్రారంభం కావాల్సి ఉండగా.. పరీక్ష కేంద్రాన్ని ఫార్మసీ కాలేజీకి మార్చామని చావు కబురు చల్లగా చెప్పారు. దీంతో బీఈడీ కాలేజీ సిబ్బంది అభ్యర్థులను హడావుడిగా అక్కడికి పంపించారు. ఫార్మసీ కాలేజీలో అప్పుడప్పుడే ఓ సదస్సు ముగుస్తోంది. పరీక్షలు నిర్వహించడం సాధ్యం కాదని, పూలే భవంతిలోని సెమినార్ హాల్‌కు మార్చారు. దీంతో అభ్యర్థులు మరోమారు అక్కడికి పరుగులు తీయాల్సి వచ్చింది.

నచ్చినట్లు రాయించేందుకా..?

పరీక్షల నిర్వహణకు ముందుగానే ఏర్పాట్లు చేసుకుంటారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా స్థానాలను కేటాయిస్తారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. కానీ వర్సిటీ అధికారుల నిర్వాకం కారణంగా గందరగోళం ఏర్పడింది. సెంటర్‌లో హాల్ టిక్కెట్ నంబర్లు కూడా వేయలేకపోయారు. పరీక్ష జరిగిన గదిలో వందల కుర్చీలు ఉన్నాయి. పరీక్షకు హాజరైంది 25 మంది మాత్రమే. గదిలో మొదటి రెండు వరుసలను వదిలేసి.. చివరి సీట్లలో వారిని కూర్చోబెట్టారు. ఉన్నఫలంగా పరీక్ష కేంద్రాన్ని మార్చడం వెనుక కొందరి స్వలాభం ఉందనే ప్రచారం జరుగుతోంది. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల నిఘా ఉండాలి. మొదట నిర్ణయించిన కేంద్రంలో ఆ సౌకర్యం ఉంది. కానీ పూలే భవన్‌లో సీసీ కెమెరాల నిఘా లేదు. తమకు నచ్చినట్లు పరీక్షలు నిర్వహించేందుకే ఇలా చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. కానీ ఇద్దరు బాలింతల వినతి మేరకు పరీక్ష కేంద్రాన్ని మార్చామని రిజిస్ట్రార్ రమేష్‌బాబు అన్నారు. ఆ ఇద్దరు అభ్యర్థులు శుక్రవారం ఉదయం వీసీని కలిశారని, పరీక్ష కేంద్ర దూరంగా ఉందని, దగ్గరలో ఏర్పాటు చేయాలని విన్నవించారని తెలిపారు. అందుకే బీఈడీ కాలేజీ నుంచి ఫార్మసీ కళాశాలకు మార్చామని, ఆ తరువాత పూలే భవన్‌లో నిర్వహించామని అన్నారు.

క్విజ్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్-2047 క్విజ్ పోటీలకు యువత దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి రవిశంకర్ తెలిపారు. జనవరి 12 స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న యువత అక్టోబరు 1 నుంచి 15లోపు మై భారత్ ఆన్‌లైన్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 15-29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ, యువకులు అర్హులన్నారు. 12 భాషల్లో మల్టిపుల్ చాయిస్‌లో క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు సెల్ నంబరు 9849913062ను సంప్రదించాలని కోరారు. క్విజ్ పోటీలకు పేర్లను mybharat.gov.in/pages/vbyld వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

డీజీపీని కలిసిన ఎంపీ అంబికా

అనంతపురం క్రైం, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు సంబంధించి పలు విషయాలను డీజీపీ అడిగి తెలుసుకున్నట్లు ఎంపీ తెలిపారు.



డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ అంబికా

టమోటా కిలో రూ.18

అనంతపురం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.18తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.10వేలు, సరాసరి ధర రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,550టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఎంపీపీ సునీతకు పదవీ గండం

అవిశ్వాసం దిశగా వైసీపీ ఎంపీటీసీల అడుగులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం ఎంపీపీ దాసరి సునీతపై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమైంది. వైసీపీకి చెందిన 13 మంది ఎంపీటీసీలు జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యను శుక్రవారం కలిసి తమ నిర్ణయాన్ని లిఖితపూర్వకంగా తెలియజేశారు. ఆయన పరిశీలించి, నిర్దేశిత ఫార్మాట్‌లో ఆర్డీఓకు పత్రాన్ని ఇవ్వాలని సూచించారు. అక్కడి నుంచి కలెక్టర్‌కు పంపుతారని, కలెక్టర్ ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో ఆర్డీఓను శనివారం కలిసి ఎన్నికల నియమావళి ప్రకారం అవిశ్వాస తీర్మాన పత్రాన్ని ఇవ్వాలని నిర్ణయించారు. ఎంపీపీ స్థానం నుంచి దాసరి సునీతను తప్పించి, కాలువ వెంకటలక్ష్మిని ఎన్నుకోవాలని వారు భావిస్తున్నారు. ఎంపీపీ ఎన్నిక సమయంలో సునీత, వెంకటలక్ష్మి చెరీ రెండున్నరేళ్లు పదవిని చేపట్టేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ సునీత పదవిని వదులుకోవడానికి సిద్ధంగా లేకపోవడంతో సమస్య తలెత్తింది. ఆమెను దించేసేందుకు పలువురు ఎంపీటీసీలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నిబంధనల ప్రకారం నాలుగేళ్ల పదవీకాలం తరువాతే అవిశ్వాసం ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ లోగా ప్రభుత్వం మారడం, దాసరి సునీత టీడీపీలో చేరడంతో వైసీపీకి షాక్ తగిలింది. ఆమెను పదవి నుంచి దించేయాలని నిర్ణయించుకున్నారు. నాలుగేళ్ల పదవీకాలం శుక్రవారంతో ముగియడంతో అవిశ్వాసం దిశగా చర్యలు ప్రారంభించారు. బుక్కరాయసముద్రంలో 19 మంది ఎంపీటీలు ఉన్నారు. వీరిలో 13 మంది వైసీపీ, ఐదుగురు టీడీపీవారు ఉన్నారు. వైసీపీవారు మూకుమ్మడిగా వ్యతిరేకిస్తుండటం, టీడీపీ సభ్యులు సైతం సునీతపై అసంతృప్తితో ఉండటంతో అవిశ్వాసం పెడితే గట్టెక్కడం కష్టంగానే కనిపిస్తోంది. అధికారుల నిర్ణయంపై ఆమె భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. వైసీపీ ఎంపీటీసీలు తనను కలిశారని, నిబంధనల మేరకు ఆర్డీఓను కలవాలని సూచించానని డిప్యూటీ సీఈఓ తెలిపారు. ఆయనను కలిసి వారిలో వైసీపీ ఎంపీటీసీలు రాజేశ్వరి, సుజాత, పెద్దనాగప్ప, భాస్కర్ రెడ్డి, కుళ్లాయప్ప, నాగయ్య శ్రీజ, రాజారెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్టు

● బంగారం, వెండి, కేబుల్ స్వాధీనం



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పలు చోరీ కేసుల్లో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సతీష్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. మడకశిర మండలం యల్లోటి గ్రామానికి చెందిన విజయ్‌కుమార్, బోయ నరేష్, పెనుకొండ మండలం మరువపల్లికి చెందిన నరసింహుల మధ్య పరిచయం ఏర్పడింది. ముగ్గురూ కలిసి చోరీలు చేయాలనుకున్నారు. అందులో భాగంగా గత 11 నెలల్లో పెనుకొండ, రొద్దంలో ఆరు ఇళ్లలో చోరీలు చేశారు. బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. పొలాల్లో సైతం కేబుల్‌ను అపహరించారు. వీటిపై కేసులు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా పుట్టపర్తి క్రాస్ వద్దనున్న అభయాంజనేయస్వామి ఆలయ సమీపాన స్కూటీలో పారిపోతున్న నిందితులను వెంబడించి, పట్టుకున్నారు. వారి నుంచి రూ.15.30 లక్షల విలువచేసే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 13.2 గ్రాముల బంగారు ఆభరణాలు, 12.8 గ్రాముల వెండి, 770 మీటర్ల కేబుల్, స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరచిన ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో డీఎస్పీ నర్సింగప్ప, సీఐ రాఘవన్ పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో జైలు శిక్ష

రొళ్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో మండలంలోని రంగనపల్లికి చెందిన సిద్దరాజుకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. రూ.5వేల జరిమానా కూడా విధిస్తూ అనంతపురం జిల్లా 4క్లాస్ అదనపు న్యాయాధికారి తీర్పు వెలువరించారు. కోర్టు కానిస్టేబుల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సిద్దరాజు అలియాస్ సిద్దయ్యను 2018లో అత్యాచారం కేసులో పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో వాదోపవాదాలు విన్న న్యాయాధికారి.. సిద్దరాజును ముద్దాయిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించారు.

సంపులో పడి చిన్నారి మృతి

పరిగి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ వెళ్లిన మూడేళ్ల బాలుడు ధోని.. నీటి సంపులో పడి మృతిచెందాడు. ఈ విషాద సంఘటన పరిగి మండల పరిధిలోని ఊటకూరులో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఈశ్వర్, శిల్ప దంపతుల కుమారుడు ధోని... మధ్యాహ్నం 2గంటల సమయంలో ఇంటి వద్ద ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడ్డాడు. కుటుంబ సభ్యులు ఆలస్యంగా గమనించారు. వెలికితీసేలోగా మృతిచెందాడు.

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.13వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 328టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా చర్యలు: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం 62వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామికరంగాన్ని ప్రోత్సహించేలా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి వారికి సకాలంలో సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులను ఇవ్వాలన్నారు. తిమ్మసముద్రం, ఊరిచింతల, కూడేరు ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఎంఎస్‌ఎంఈ పారిశ్రామికవాడలను త్వరగా అభివృద్ధి చేయాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను ఆదేశించారు. పీఎంఈజీపీ పథకం ద్వారా అర్హులైన వారి నుంచి నాణ్యత గల పథకాలను ఎంపిక చేయాలని పరిశ్రమల అధికారిని ఆదేశించారు. స్టాండప్ ఇండియా పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి విరివిగా రుణాలు మంజూరు చేయించాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. రాయదుర్గంకు చెందిన పారిశ్రామికవేత్తకు స్థల సేకరణ చేయాలని పరిశ్రమల అధికారిని ఆదేశించారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పిస్తాం

జిల్లా కేంద్రం నుంచి గ్రామ స్థాయి వరకు జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాలపై సామాన్య ప్రజలకు సైతం అవగాహన కల్పించేవిధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఆనంద్, పన్నుల శాఖ, జీఎస్టీ, ఏపీ ఎస్సీడీపీ, నెడ్‌క్యాప్ శాఖల అధికారులు పాల్గొన్నారు. పలు అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పీఎం కుసుం పథకానికి సంబంధించి 20 విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో 111మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల పనులను పూర్తి చేయటానికి అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆయా సమావేశాల్లో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్ యాదవ్, అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, రవాణా శాఖ అధికారి వీర్రాజు, జెడ్‌ఎం దేవకాంతమ్మ, ఎల్‌డీఎం నరేష్‌రెడ్డి, పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ భాస్కర్‌వల్లి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ శేషాద్రి, నెడ్ క్యాప్ అశోక్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్

న్యూస్ బాక్స్

సబ్‌స్టేషన్ వద్ద రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

గాండ్లపెంట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై శుక్రవారం మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. కటకంవారిపల్లి, తూపల్లి, వంకపల్లి గ్రామాల గత ఆరు నెలలుగా లైన్‌మ్యాన్ లేరని, ఏదైనా విద్యుత్ సమస్య వస్తే పట్టించుకునే నాథుడే లేడని వారు మండిపడ్డారు. నిత్యం విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని అన్నారు. ఏఈ ఇన్‌చార్జ్ కావడంతో ఆయన కూడా అందుబాటులో ఉండడం లేదని తెలిపారు. విద్యుత్ అంతరాయంతో సాగుచేసిన పంటలకు నీటి తడులు ఇవ్వడానికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ గ్రామాలకు లైన్‌మ్యాన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈవిషయంపై ట్రైనీ ఎస్ఐ రవికుమార్ ఆందోళనకారులతో చర్చించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

5న కంటి వైద్యశిబిరం



కరపత్రాలను విడుదల చేస్తున్న యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

ధర్మవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో అక్టోబరు 5న నిర్వహించే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలానాగేంద్ర, కార్యదర్శి జయరాం తెలిపారు. బెంగళూరు నేత్రజ్యోతి కంటి ఆసుపత్రి, యువర్స్ ఫౌండేషన్ సంయుక్తంగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కంటి వైద్యశిబిరం కరపత్రాలను విడుదల చేశారు. 5న ఆదివారం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతనిధులు మోహన్, సుకుమార్, రమేశ్‌బాబు, శ్రీనివాసులు, డాక్టర్ బీవీసుబ్బారావు, చాంద్‌బాషా పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సహకార సంఘం అధ్యక్షుడు బోయపల్లి శివారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంతో కూడిన దాదాపు 50 రకాల వంటకాలను ప్రదర్శించారు. ప్రదర్శనలో బాలామృతం, ఇతర పౌష్టికాహారం కేక్‌లు తయారు చేసిన గౌనిపల్లి అంగన్‌వాడీ కార్యకర్త షమీమ్‌కు తమ వంతుగా సహకార సంఘం అధ్యక్షుడు ప్రోత్సాహక నగదు బహుమతి అందించారు. స్వస్తనారీ, స్వశక్తిపరివార్ అభియాన్‌లో భాగంగా వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్ఎంపీ క్రిష్ణమూర్తి, డీలర్ శివనారాయణ, రాజగోల్, వైద్యులు కమల్‌రోహిత్, సీహెచ్ఓ ప్రమీల, ఆరోగ్య కార్యకర్తలు ఇందిరమ్మ, లక్ష్మీదేవి, వసుంధర, గోపాల్‌నాయక్, ప్రభాకర్, అంగన్‌వాడీ కార్యకర్తలు స్వర్ణ, సునంద, సుకన్య, ప్రమీల, మంజుల, శ్యామల, వసంత పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు



సచివాలయ సిబ్బందితో అర్జీలపై చర్చిస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గత నెలలో నిర్వహించిన మీ సమస్యామా బాధ్యత కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌కు ప్రజలు అందించిన అర్జీలను టీడీపీ నాయకులు పరిశీలించారు. అర్జీలను శుక్రవారం 9, 22,31 వార్డులలోని సచివాలయాల్లో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, నాగూర్‌హుస్సేన్, షరీఫ్, షేర్‌చంద్ర, ఆది, లచ్చి, నాగేంద్ర పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

నల్లమాడ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓగా శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తూ.. ఉద్యోగోన్నతిపై నల్లమాడ ఎంపీడీఓగా వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ ఆజాద్ ఉద్యోగోన్నతిపై కమలాపురం వెళ్లారు. నూతన ఎంపీడీఓకు టీడీపీ నాయకులు, కార్యదర్శులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్, సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, రమావత్ భారతి చాప్లానాయక్, మంజునాథ్‌రెడ్డి, బుట్టి నాగభూషణనాయుడు, రామచంద్ర పాల్గొన్నారు.



ఎంపీడీఓను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు



ధర్మవరంలో ధనలక్ష్మీదేవి అలంకరణ



కదిరిలో కాశీ విశాలాక్షిగా..



పార్వతీదేవి అలంకరణ



బత్తలపల్లిలో వరలక్ష్మీదేవిగా..

ధనలక్ష్మిగా దుర్గామాత

(న్యూస్ నెట్‌వర్క్ - ఆంధ్రజ్యోతి)

దసరా పండుగను పురస్కరించుకుని దేవీశరన్నవ రాత్రుల ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. శుక్రవారం దుర్గామాతకు పలు ఆలయాల్లో ధనలక్ష్మి అలంకరణ చేశారు. ధర్మవరం పట్టణంలో ఆయా ఆలయాల్లో పూజారులు అమ్మవార్ల మూలవిరాట్‌లకు పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. దుర్గమ్మ ఆలయంలో మహాలక్ష్మి, రాంనగర్‌లో చౌడేశ్వరిదేవికి మహాలక్ష్మి అలంకరణ చేశారు. పుట్టపర్తిలో సత్యమ్మ, మామిళ్లకుంట లలితా పరమేశ్వరి, ఎనుమలపల్లి దుర్గాదేవి ఆలయాల్లో అమ్మవార్లు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ప్రశాంతి నిలయంలోని గాయత్రీమాతకు విశేషాలకంరణ చేశారు. పలు కాలనీల్లో వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. కదిరి, బత్తపల్లి, కొత్తచెరువు తదితర ప్రాంతాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు.



ధర్మవరంలో కూష్మాండదేవి అలంకారంలో చౌడేశ్వరీదేవి



పుట్టపర్తిలో మహాలక్ష్మిగా సత్యమ్మ తల్లి



మహాలక్ష్మిగా మామిళ్లకుంట లలితా పరమేశ్వరి



అమడగూరులో స్కందమాతగా చౌడేశ్వరి



కొత్తచెరువులో మహాలక్ష్మిగా పెద్దమ్మతల్లి

చాకలి ఐలమ్మ పోరాటాలు స్ఫూర్తిదాయకం

కదిరిఅర్బన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ముఖ్యభూమిక పోషించిన వీర వనిత చాకలి ఐలమ్మ సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. చాకలి ఐలమ్మ జయంతిని శుక్రవారం పట్టణంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆర్అండ్‌బీలో బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో, దోబీఘాట్ వద్ద రజక సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె చేసిన సేవలు, పోరాటాలను కొనియాడారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు, నాయకులు నారాయణ, సాయిశీనా, ఇర్ఫాన్, శ్రీనివాసులు, శ్యామ్‌సుందర్, హరి, రజక సంఘం నాయకులు శ్రీనివాసులు, నారాయణ, రామకుమార్, కేఆర్ హరిప్రసాద్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.





కదిరి, ధర్మవరంలో చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న బీసీ ఉద్యోగులు, రజక సంఘం నాయకులు

● ధర్మవరం: వీర వనిత చాకలి ఐలమ్మ 130వ జయంతి వేడుకలను శుక్రవారం రజక సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజకసంఘం నాయకులు నారాయణస్వామి, ముత్యాలు, నరసింహులు, నాగభూషణ, వెంకటేశ్, గంగరాజు, మస్తానప్ప, వెంకటనారాయణ, సూరి,రమేశ్ పాల్గొన్నారు.

తపాలా కార్యాలయంలో చోరీ

కదిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంపరిధిలోని కుటాగుళ్ల తపాలా కార్యాలయంలో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు సీఐ నారాయణ రెడ్డి శుక్రవారం తెలిపారు. కుటాగుళ్ల గ్రామంలోని తపాలా కార్యాలయంలో పోస్టుమాస్టర్‌గా వేముల వంశీకృష్ణ గత రెండున్నర నెలలుగా పని చేస్తున్నారన్నారు. కాగా గురువారం గుర్తు తెలియని వ్యక్తులు తపాలా కార్యాలయం ప్రధాన ద్వారం తాళం పగలకొట్టి లోనికి ప్రవేశించి, కార్యాలయంలో లోపల లాకర్‌లో ఉన్న దాదాపు రూ.1,24,500 చోరీ చేసినట్లు చెప్పారు. పోస్టుమాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



నగదు పెట్టెను పగలకొట్టిన దృశ్యం

తాళం వేసిన ఇంటిలో..

ముదిగుబ్బ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన కొరవపల్లి రమణమ్మ ఇంటిలో గురువారం రాత్రి దొంగలు పడ్డారు. ఇంట్లో ఉన్న సుమారు 6.8 తులాల బంగారం ఆభరణాలను చోరీ చేశారు. రమణమ్మ గురువారం రాత్రి ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న తన అక్క ఇంట్లో నిద్రపోయింది. తెల్లారి లేచి ఇంటికి రాగా తాళాన్ని ఇనుపరాడ్డుతో బద్దలు కొట్టి చోరీకి పాల్పడినట్లు గుర్తించానని బాధితురాలు తెలిపారు. బీరువాను పరిశీలించగా ఆభరణాలు కనిపించలేదని కన్నీటిపర్యంతమయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివరాముడు తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువతి ఆత్మహత్య

ధర్మవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక చంద్రబాబునగర్‌కు చెందిన బాలునాయక్ కుమార్తె పల్లవి (23) ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో గురువారం అర్ధరాత్రి ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చంద్రబాబునగర్‌కు చెందిన బాలునాయక్, కుళ్లాయమ్మబాయి దంపతులకుమార్తె పల్లవి ఎంబీఏ చదివింది. ఉద్యోగం కోసం ప్రయత్నించినా రాలేదు. ఈ బాధలో ఉన్న ఆమెకు కొంతకాలంగా కడుపు నొప్పి వేధిస్తుండేది. దీంతో మనస్తాపం చెంది గదిలో ఉరేసుకుని, మరణించింది. ఉదయం కుటుంబ సభ్యులు లేచి గది తలుపులు తెరవగానే పల్లవి ఉరికి వేలాడుతూ కనిపించడంతో బోరున విలపించారు. టూటౌన్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

ముదిగుబ్బ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. అనంతపురంలోని సిండికేట్ నగర్‌కు చెందిన హనుమంతరెడ్డి శుక్రవారం కదిరి నుంచి ద్విచక్ర వాహనంలో అనంతపురం వెళుతుండగా.. ముదిగుబ్బ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108లో బాధితుడిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెవాండ్లపల్లిలో శుక్రవారం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను వీఆర్ఓ శ్రీలత, టీడీపీ నాయకుడు మండోజీ తోపిక్‌ఖాన్, తదితరులు పంపిణీ చేశారు. కార్డుల వినియోగం, ఉపయోగాలను వివరించారు.

వాహనాల తనిఖీ



వాహన రికార్డులను పరిశీలిస్తున్న ఎంవీఐ వరప్రసాద్

నంబులపూలకుంట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో శుక్రవారం ఎంవీఐ వరప్రసాద్ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైసెన్సులు, అనుమతులు, ఇన్సూరెన్స్, పర్మిట్ లేని వాహనాలను తనిఖీ చేశామని తెలిపారు. ఏడు వాహనాలకు అనుమతులు లేకపోవడంతో రూ.76,500 అపరాధరుసుం వేసినట్లు చెప్పారు.

శిక్షణ ద్వారా భవితకు భరోసా

కదిరిఅర్బన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యాకోర్సు విద్యార్థులకు నైపుణ్య శిక్షణద్వారా భవితకు భరోసా కల్పించడంలో విద్యాశాఖ ప్ర త్యేక దృష్టి సారించిందని ప్రధానోపాధ్యాయులు లియాకత్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ద్విచక్రవాహన షోరూమ్‌లో విద్యార్థులకు వాహనాల మరమ్మతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీసీడీఓ ఎం సంపూర్ణ, ఒకేషనల్ కోఆర్డినేటర్ మధు, క్రిష్ణ, చైతన్య పాల్గొన్నారు.

పల్లెలకు చేరిన పానీపూరీ..!

● ప్రతిరోజు క్రమం తప్పకుండా రాక
● ఆస్వాదిస్తున్న గ్రామీణులు

తనకల్లు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు పానీ పూరీ కావాలంటే పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. గ్రామీణ ప్రాంతాల్లోని చాలా మందికి పానీపూరి గురించి తెలియదు. పట్టణ ప్రాంతాల్లో నివాసం ఉండేవారు సాయంత్రం సమయంలో అలా కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులతో బజారుకెళ్లినప్పుడు సరదాగా పానీపూరి తినేవారు. అలాంటి పానీ పూరీ నేడు తనకల్లు మండలంలోని మారుమూల ప్రాంతాలకు కూడా చేరింది. ఢిల్లీకి చెందిన పలువురు వ్యాపారులు సమీపంలోని అన్నమయ్య జిల్లా మొలకలచెరువులో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అక్కడి నుంచి ప్రతిరోజూ ద్విచక్ర వాహనాల్లో తనకల్లు మండలంలోని వివిధ గ్రామాలకు పానీపూరి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. శుక్రవారం తనకల్లు మండలంలోని ఎర్రగుంటపల్లిలో ఢిల్లీకి చెందిన దేశ్‌ముఖ్ అనే యువకుడు పానీపూరి, బొరుగులు విక్రయిస్తుండడంతో పలువురు బండివద్ద చేరి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆ యువకుడు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ప్రతిరోజు క్రమం తప్పకుండా సాయంత్రం 4.30 నుంచి 5 గంటలలోపు గ్రామానికి వస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ప్రతిరోజు దాదాపు రూ. వెయ్యి వరకు వ్యాపారం జరుగుతుందన్నారు. ఇందులో తనకు పెట్రోల్, పానీపూరి తయారీ ఖర్చులు పోనూ రోజు రూ.300నుంచి 400 దాకా ఆదాయం వస్తున్నట్లు చెప్పారు. పానీపూరి గ్రామాలకు రావడంతో గ్రామీణులు ఆనందంతో ఆస్వాదిస్తున్నారు.



ఎర్రగుంటపల్లిలో పానీపూరీ విక్రయిస్తున్న దేశ్‌ముఖ్

క్రీడలతో మానసిక ఉల్లాసం



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు

ధర్మవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఉన్న ఎన్జీఓ హోంలో శుక్రవారం నిర్వహించిన షటిల్ టోర్నీని ఆయనతోపాటు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ క్రీడలలోనైనా గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా తీసుకోవాలని సూచించారు. ఈ టోర్నీలో 40 జట్లు పాల్గొన్నాయి. శని, ఆదివారాల్లో కూడా ఈ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింకా చంద్ర, జిల్లా కార్యదర్శి డోలా రాజారెడ్డి, ఫ్రెండ్స్ షటిల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాయల్టీలో వడ్డెర్లకు మినహాయింపు ఇవ్వాలి



మాట్లాడుతున్న వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ వలిపి శ్రీనివాసులు

కొత్తచెరువు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): వడ్డెర్లకు పూర్తిస్థాయిలో రాయల్టీ మినహాంచాలని వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ వలిపి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో విలేకరుల మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా వడ్డెర్లు తమ వృత్తి కొనసాగిస్తున్నారని, వారికి ప్రభుత్వం రాయల్టీ పూర్తిగా మినహాయించి ఆదుకోవాలని అన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అసెంబ్లీలో దీనిపై చర్చించడం అభినందనీయం అన్నారు. వడ్డెర్లు బండలు, రాళ్ల కొడుతూ జీవనం సాగిస్తున్నారని, రాయల్టీని చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో కూడా రాయల్టీని తొలగించాలని సీఎం చంద్రబాబునాయుడుకు విన్నవించామన్నారు. సమావేశంలో వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

29న బీసీల సమస్యలపై సమావేశం

కదిరిఅర్బన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 29న పుట్టపర్తిలో జరిగే సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 143 కులాలు ఉన్నాయని, గత స్థానిక ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన స్థానాలను తగ్గించడం వల్ల పదవులు కోల్పోయారని అన్నారు. ఈ సమావేశానికి సీపీఐ జాతీయ కార్యదర్శి రామక్రిష్ణ, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు. సమావేశంలో నాయ కులు పవన్, లియాకత్, మధునాయక్, రమణ, ఆదెప్ప, చలపతినాయుడు పాల్గొన్నారు.

అప్రాచెరువులో వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బత్తలపల్లి,సెప్టంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్రాచెరువులో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన వైదేహి సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పలు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి వైదేహి ఆసుపత్రిలోనే చికిత్సలు చేస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి కార్యాలయ పీఏ హరీష్‌బాబు, బీజేపీ నాయకులు వీరనారప్ప, భాస్కర్, రామచంద్ర పాల్గొన్నారు.

టోకెన్ పద్ధతిలో యూరియా పంపిణీ



పాతబత్తలపల్లిలో యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు

నల్లమాడ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతబత్తలపల్లి, వేళ్లమద్ది రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం రైతులకు యూరియాను టోకెన్ పద్ధతిలో పంపిణీ చేసినట్లు ఏఓ అబ్దుల్‌హక్ తెలిపారు. గ్రామాల్లో వరి సాగుచేసిన రైతులకు యూరియాను టోకెన్ పద్ధతిలో రైతుకు ఒక బస్తా ప్రకారం అందించామన్నారు. పంటలు సాగుచేసిన రైతులు ఈనెల 30లోపు వాటిని నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగనాయక్‌లు, సింగల్ విండో అధ్యక్షుడు గడ్డం రమణారెడ్డి, రైతు సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి విద్యతో ఉపాధి

ధర్మవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్య విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. ఒకేషనల్ విద్యార్థులకు దసరా సెలవుల్లో సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 10 రోజులు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం జరుగుతోందన్నారు. ఇది పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. ఒకేషనల్ ట్రైనర్స్ చైతన్యలక్ష్మి, జిల్లా కో ఆర్డీనేటర్స్ మధుమనోహర్, కృష్ణచైతన్య ఇంటర్న్‌షిప్ ప్రాంతాన్ని శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, వీవింగ్ ప్రాసెస్, షర్ట్‌స్టిచింగ్ నేర్పిస్తున్నామని తెలిపారు.



విద్యార్థినులకు కంప్యూటర్ ఎంబ్రాయిడరీ చూపుతున్న ప్రిన్సిపాల్

న్యూస్ బాక్స్

వైభవంగా గాజుల ఉత్సవం


ఉత్సవంలో పాల్గొన్న మహిళలు

మడకశిర టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): శరనవరాత్రులు పురస్కరించుకొని పట్టణంలోని ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఊరి మారెమ్మ ఆలయంలో వ ఎహిళలు గాజుల ఉత్సవం నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. వడిసలమ్మ, కన్యకాపరమేశ్వరి అమ్మవారు మహాలక్ష్మిదేవి అలంకణలో భక్తులకు దర్శనమిచ్చారు.

తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు



గుడిబండ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన తుమ్మల మారెమ్మ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వెండి ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పంచాయతీల పురోగతిపై శిక్షణ


మాట్లాడుతున్న ఎంపీడీఓ కమలాబాయి

గోరంట్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీల అభివృద్ధి విషయంలో మండలస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కమలాబాయి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు అభివృద్ధిపై చర్చించారు. అభివృద్ధి పనులపై ప్రణాళిక రూపకల్పనకు తగిన సూచనలిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీడీపీ కార్యకర్త మృతి


ముద్దమ్మ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

రొద్దం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రొప్పాల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ముద్దమ్మ(60)అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు గ్రామానికి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శుక్రవారం రొప్పాల గ్రామానికి చెందిన మాజీ కన్వీనర్ నరసింహమూర్తి తల్లి ముద్దమ్మ మృతిచెందారు. నాయకులు నరసింహమూర్తికి ఆర్థిక సాయం అందించారు. మాధవనాయుడు, చిన్నప్పయ్య, వెంకటరామిరెడ్డి, నరహరి, సింగిల్‌విండో అధ్యక్షుడు వీరాంజనేయులు, మారెప్ప పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్


సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

పరిగి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా జయమంగళి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శుక్రవారం పోలీసులు సీజ్ చేశారు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు శ్రీరంగరాజులపల్లి గ్రామ సమీపంలోని జయమంగళి నది నుంచి నల్లాయనపల్లి, దొడ్డేపల్లి, కర్ణాటకకు చెందిన ట్రాక్టర్లు ఇసుక తరలిస్తుండగా స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకుని వాటిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. అలాగే పరిగి మండల కేంద్రంలోని సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయం సమీపంలో హిందూపురం మండల పులమతికి చెందిన ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి కేసు నమోదుచేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

అక్రమ మద్యం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

గోరంట్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం రవాణా కేసులో గోరంట్ల మండలానికి చెందిన గంగాధర్, కిరణ్‌కుమార్‌కు పెనుకొండ ప్రిన్సిపుల్ జ్యుడీషియల్ కోర్టు న్యాయాధికారి బొజ్జప్ప ఆరు నెలల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు సీఐ శేఖర్ తెలిపారు. మండలంలోని బూగానిపల్లికి చెందిన గంగాధర్, గుమ్మయ్యగారిపల్లి కిరణ్‌కుమార్ ద్విచక్రవాహనంపై కర్ణాటక మద్యం తీసుకువస్తుండగా 2020 జూన్ 20న అప్పటి సీఐ జయనాయక్ అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించారు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ భాస్కర్, నారాయణస్వామి సాక్షులను కోర్టుకు హాజరు పరచగా, ఏపీపీ శ్యామల వాదనలు వినిపించారు. నేరం రుజువుకావడంతో నిందితులిద్దరికి ఆరు నెలలు జైలు, రూ.7,025 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

మూగజీవాల మృత్యువాత

● విషప్రయోగం అంటున్న బాధితులు

సోమందేపల్లి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లి గ్రామంలో మూగజీవాలు హఠాత్తుగా చనిపోవడంతో ఆ కుటుంబానికి తీరని వేదన మిగిల్చింది. గ్రామానికి చెందిన కురుబ మారుతి, అంజినమ్మలకు గొర్రెలు, ఆవులు ఉన్నాయి. ప్రతిరోజూలానే గురువారం రాత్రి వాటిని షెడ్డులో తోలి నిద్రపోయారు. శుక్రవారం ఉదయం ఎనిమిది గొర్రెలు, ఒక ఆవు మృతిచెంది ఉండటాన్ని గమనించి కన్నీరుమున్నీరయ్యారు. తమపై కక్షతో కావాలనే విషప్రయోగం చేసి ఉంటారని మారుతి ఆరోపించారు. పశువులు కడుపు ఉబ్బి నోటిలో నురుగురావడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇది విష ప్రయోగమా లేదా అనారోగ్యం కారణమా అనేది పశుసంవర్ధకశాఖ అధికారులు నిగ్గుతేల్చాల్సి ఉంది. ఈ విషయంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. రూ.2లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.


శారదా శంకర మఠంలో దుర్గామాత


గజమహాలక్ష్మి సమేత పేట వెంకటరమణస్వామి


పెనుకొండ: ఆరోగ్యలక్ష్మిగా వాసవీమాత


పరిగి: కనకదుర్గాదేవిగా సప్తమాతృక

అష్టలక్ష్మీ పాహిమాం..!

శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా అమ్మవారు ఐదోరోజు శుక్రవారం భక్తులకు వివిధ రూపంలో దర్శనమిచ్చారు. శుక్రవారం దుర్గామాతకు ఇష్టమైనరోజు కావడంతో మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


మహాలక్ష్మి అలంకారంలో గాయత్రీదేవి


గోరంట్ల: అమ్మవారికి అలంకరణ

కృష్ణమ్మకు జల హారతి

● మడకశిరకు చేరిన కృష్ణాజలాలు
● రైతుల్లో వెల్లివిరిసిన ఆనందం


సి. కొడిగేపల్లి వద్ద కృష్ణమ్మకు జలహారతి ఇస్తున్న టీడీపీ నాయకులు, రైతులు

మడకశిర రూరల్ సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మకు స్థానిక టీడీపీ నాయకులు శుక్రవారం జలహారతి ఇచ్చారు. హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు మడకశిర మండలం సీ కొడిగేపల్లి, నల్లనాయణపల్లి గ్రామాల వద్దకు చేరుకున్నాయి. విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు, రైతులు అక్కడికి చేరుకుని కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. ఆయన మాట్లడుతూ సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండమల తిప్పేస్వామి కృషి వల్ల కృష్ణా జలాలు చెరువులకు చేరుతున్నాయన్నారు. సీఎం రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. అనంతరం రైతులు టీడీపీ జెండా పట్టుకుని నీటిలోకి దిగి ఆనందం వ్యక్తం చేశారు. ప్రధాన కార్యదర్శి మారుతి రెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి రైతులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కూటమి పాలనలోనే రైతుల అభివృద్ధి: మారుతి రెడ్డి, మణూరు గ్రామం

కూటమి పాలనలోనే రైతుల అభివృద్ధి సాధ్యం. కృష్ణా జల్లాలు నియోజకవర్గానికి రావడం ఎంతో సంతోషంగా ఉంది. చెరువులన్నీ నిండితే రైతులు ఆనందంగా ఉంటారు.


హంద్రీనీవా కాలువలోకి దిగి టీడీపీ నాయకులు సంబరాలు

బాలయ్యను విమర్శించే స్థాయి నీకెక్కడిది?

● వైసీపీ నాయకురాలిపై తెలుగు మహిళల ఆగ్రహం


డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు

హిందూపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను విమర్శించే స్థాయి నీకెక్కడిదని వైసీపీ మహిళా విభాగం నాయకురాలిపై తెలుగు మహిళలు మండిపడ్డారు. గురువారం అసెంబ్లీలో బాలకృష్ణ మాట్లాడిన వ్యాఖ్యలపై వైసీపీ నాయకురాలు నాగమణి ఒక వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఆ వీడియోలో ఆమె ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిందని, టీడీపీకి చెందిన కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీదేవి, అంగనవాడీ నాయకురాలు వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, చెన్నమ్మతోపాటు మరికొంత మంది మహిళలు శుక్రవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో నాగమణిపై డీఎస్పీ మహేష్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, శివశంకర్, అమర్నాథ్, బాచి, అంజాద్, రామాంజినమ్మ పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

చిలమత్తూరు: ఎమ్మెల్యే బాలకృష్ణపై అనుచితంగా మాట్లాడుతూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన హిందూపురానికి చెందిన వైసీపీ నాయకురాలు నాగమణిపై టీడీపీ నాయకులు పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. గురువారం అసెంబ్లీలో బాలకృష్ణ మాజీ సీఎం జగన్మోహనరెడ్డిని సైకో అని మాట్లాడారంటూ ఆమె ఎమ్మెల్యే గౌరవాన్ని కించపరిచే విధంగా మాట్లాడిందనీ, ఆమెపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీదేవి ఎస్ఐ మునీర్ అహమ్మదికి ఫిర్యాదు చేశారు. మండల కన్వీనర్ శ్రీనివాసులు, చంద్ర, మంజు, నందీషప్ప, లక్ష్మీదేవి, చెన్నమ్మ పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి వైద్య పరీక్షలు

హిందూపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎంజీఎం పాఠశాలలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

గుడిబండ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మల్బరీ రైతులు సేంద్రియ ఎరువుల వాడకంతో అధిక దిగుబడులు సాధించవచ్చని అనంతపురం శాస్త్రవేత్త డాక్టర్ రమ్య అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మలాపురం గ్రామంలో పట్టు రైతులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మల్బరీ సాగుచేసే రైతులు ముందుగానే భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. అధికారుల సూచనలు తప్పక పాటించాలన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ హనుమంతరాయప్ప, పట్టుపరిశ్రమ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ముందస్తు చర్యలు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇస్లాపురంలో దోమల నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి గోపీనాయక్ నాగప్పకుంటలో గంబుషియా చేపలు శుక్రవారం నీటిలో వదలారు. దోమల లార్వాలను ఈ చేపలు నాశనం చేస్తాయన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి విషజ్వరాలు ప్రబలకుండా అడ్డుకుంటాయన్నారు. స్థానిక కౌన్సిలర్ హనుమంతుయాదవ్, ఎంపీహెచ్ఏ జనార్దన్‌రెడ్డి, గంగమ్మ, ఆశ, గంగా, హనుమంతు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించండి

గుడిబండ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాలను బీఎల్‌ఓలు తప్పక పాటించాలని తహసీల్దార్ శ్రీధర్ సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను ఓటరు జాబితాలో చేర్చేందుకు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. జాబితాలో పేర్లు తప్పులు సవరించుకోవాలన్నారు. డీటీ కల్యాణ్ చక్రవర్తి, రీసర్వే డీటీ రాంభూపాల్‌రెడ్డి, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ పోటీలు

మడకశిర టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కళాశాల మైదనంలో శనివారం నుంచి ఐదు రోజుల పాటు లెదర్‌బాల్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు అభిమన్యు స్పోర్ట్స్ అండ్ కల్చరల్ యూత్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. అక్టోబర్ 2వ తేదీన ఫైనల్ మ్యాచ్ ఉంటుందన్నారు. లెదర్ బాల్ క్రికెట్ టోర్నీలో విజేతలకు రూ.30వేలు, రన్నర్స్‌కు రూ.20 వేలు అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ జట్ల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చేతుల మీదుగా నగదు అందజేస్తున్నట్లు తెలిపారు.

రేపు గణేశ్ నిమజ్జనం


హిందూ మహాగణపతి వద్ద మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకులు

పావగడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్, ఆర్‌ఎస్‌ఎస్, శ్రీరామసేన ఆధ్వర్యంలో బ్రాహ్మణవీధిలో నెలకొల్పిన గణపతిని భారీ భద్రత నడుమ ఆదివారం నిమజ్జనం చేయనున్నట్లు శ్రీరామసేన అధ్యక్షుడు కావలిగేరే రామాంజి, అలకందప్ప, కార్తీక్ తెలిపారు. శోభయాత్ర కార్యక్రమానికి వీహెచ్‌పీ బ్రాండ్ అంబాసిడర్ బసవన్నగౌడ్, యత్నాల్, సీటీ రవి, ప్రతాప్, సింహ, చిత్రదుర్గం ఎంపీ గోవింద కారుజోళ, నిఖిల్‌కుమార్‌స్వామి పాల్గొంటారన్నారు. ఉదయం 11 నుంచి రాత్రి 9గంటల వరకు శోభయాత్ర ఉంటుందన్నారు. కార్యక్రమంలో జానపద, వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్లకు మహర్దశ

● రూ.3 కోట్లతో మరమ్మతులు
● మారనున్న రూపురేఖలు

మడకశిర, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దెబ్బతిన్న రోడ్లకు మహర్దశ రానుంది. గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన రోడ్లకు మర్మతులు లేకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడమే కాక వేగంగా పనులు జరుగుతున్నాయి. మడకశిర నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.3కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇందులో మడకశిర మండలం అగ్రంపల్లి నుంచి సి.కొడిగేపల్లి రోడ్డుకు రెండు కిలో మీటర్లకు రూ.80 లక్షల పనులు ప్రారంభమయ్యాయి. అమరాపురం నుంచి బంగారుపాళ్యం వరకు మూడు కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.1.20 కోట్లు, అమరాపురం నుంచి వీరాపురం రోడ్డుకు 2.5 కిలోమీటర్లకు కోటి రూపాయలు మంజూరయ్యాయి. ఈ విషయమై పంచాయతీరాజ్ శాఖ డీఈ వెంకటేశులు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో 7.5 కిలో మీటర్ల బీటీ రోడ్ల నిర్మాణాలకు రూ.3 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అగ్రంపల్లి నుంచి సి.కొడిగేపల్లి పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయని వివరించారు.


చురుగ్గా సాగుతున్న అగ్రంపల్లి రోడ్డు పనులు

ఖైదీల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

● జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్


మాట్లాడుతున్న న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి

హిందూపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తప్పులుచేసి కారాగారానికి వచ్చే ఖైదీలపట్ల నిర్లక్ష్యం చేయకుండా వారిఆరోగ్యంపై శ్రద్ధచూపాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. శుక్రవారం సబ్‌జైలును ఆయన తనిఖీ చేశారు. ఖైదీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు ఖైదీలతోమాట్లాడుతూ బయటికి వెళ్లాక సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. సబ్‌జైలులో ఉన్న ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సబ్‌జైలు అధికారి హనుమప్ప, న్యాయవాదులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులు, నాయకుల మధ్య క్రికెట్ పోటీ


గెలిచిన జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

సోమందేపల్లి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం అధికారులు, కూటమి నాయకులు సరదాగా క్రికెట్ ఆడారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ఏక్ దిన్ ఏక్ ఘంటా, ఏక్‌సాథ్ నినాదంతో ఆటల్లో పాల్గొన్నారు. అధికారులపై నాయకులు గెలుపొందగా నగర కార్పొరేషన్ చైర్మన్ రంగేపల్లి వెంకటరమణ వారికి మెమెంటోలు అందజేశారు. క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు శారీరక ఆరోగ్యానికి మంచిదన్నారు. పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది, నాయకులు నీరుగంటి చంద్ర, ఆంజనేయులు, చాకర్లపల్లి శ్రీరాములు, వడ్డె సూరి, గంగిశెట్టి రమణ, సూర్యనారాయణ కిష్టప్ప, మద్దిలేటి, ఆనంద్ పాల్గొన్నారు.

కియ పోలీసు స్టేషన్ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ నర్సింగప్ప

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మవారిపల్లి కియ పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ నర్సింగప్ప శుక్రవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వాహనాలతో ట్రాఫిక్ సమస్య


అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా నిలిచిన కంటెయినర్లు


చిలమత్తూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కొడికొండ చెక్‌పోస్టులోని సర్వీసు రోడ్డులో భారీ కంటెయినర్లు ఆపుతుండటంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఎలక్ట్రానిక్ స్కూటర్స్‌కి సంబంధించిన ఓ ప్రైవేటు పరిశ్రమను సర్వీసు రోడ్డుకు ఆనుకొని ఉన్న భవనాల్లో ఏర్పాటుచేశారు. దీంతో పరిశ్రమకు సంబంధించి వాహనాల విడిభాగాలను తీసుకువచ్చే కంటెయినర్లు పదుల సంఖ్యలో లోడ్, అన్‌లోడ్ చేయడానికి పరిశ్రమ ప్రధాన గేటులోని సర్వీస్ రోడ్డులో ఆపేస్తున్నారు. దీంతో వాహనాలు పెద్దవి కావడంతో అక్కడ వాటిని మలుపు తిప్పుకోవడం కష్టంగా మారుతోంది. దీంటో కంటెయినర్లు అన్ని సర్వీసు రోడ్డులోనే ఆపేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. సాయంత్రం సమయంలో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోందని స్థానికులు వాపోతున్నారు. కంటెయినర్లను వేరేచోట ఆపే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


సుబ్బరావుపేట వద్ద ప్రమాదకరంగా మారిన చిత్రావతి కాజ్ వే

చిలమత్తూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు చిత్రావతి నది పారడంతో సుబ్బరావు పేట వద్ద కాజ్‌వే కోతకు గురైంది. దీంతో కాజ్‌వే ఒకవైపు గుంత ఏర్పడి వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. దీనిగుండా చాగలేరు, పలగలపల్లి, సుబ్బరావుపేట గ్రామాలకు నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. ఇటీవల కర్ణాటకలో భారీ వర్షాలు కురువడంతో చిత్రావతి నది ప్రమాదకర స్థాయిలో పారింది. మరోసారి నది ప్రవహిస్తే కాజ్‌వే కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. రాత్రి సమయాల్లో ఈ మార్గం గుండా ప్రయాణాలు చేసే వారికి ప్రమాదం పొంచి ఉన్నట్లేనని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు గుర్తించి వెంటనే కాజ్‌వేని బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమాచార బోర్డులో పేర్లను మార్చరా..?



సమాచార బోర్డులో బదిలీ అయిన అధికారుల పేర్లు అలాగే ఉంచిన దృశ్యం

గుడిబండ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో ని కరికెర గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమాచార బోర్డులో ఉన్న పేర్లను మార్చాలని ప్రజలు కోరారు. సమాచార బోర్డులో ఉన్న కార్యదర్శి వెన్నెల, ఎంపీడీఓ నరేంద్ర కుమార్‌లు బదిలీఅయిన సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ సమాచార బోర్డులో అలాగే కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పనిచేస్తున్న అధికారుల పేర్లను సమాచార బోర్డులో నమోదు చేయాలని పంచాయతీ ప్రజలు కోరారు.